www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 22 సెప్టెంబర్ 2023
5
అన్నమయ్య



ప్రశాంతంగా అంగన్వాడీ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - రాయచోటి

డివిజన్ పరిధిలో లక్కిరెడ్డిపల్లి, పీలేరు, రాయచోటి, వాల్మీకిపురంలోని(గుర్రంకొండ) ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న కార్యకర్తలు (3), సహాయకురాలు (8) , మినీ అంగన్వాడీ కార్యకర్తలు (6) పోస్టుల భర్తీ కొరకు గురువారం ఇంటర్వ్యూలు ప్రశాంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి ధనలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీ పోస్టుల భర్తీ కోసం ఇంటర్వ్యూలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తి చేశామని చెప్పారు. ఇంటర్వ్యూలు రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి, కమిటీ సభ్యులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎన్.కొండయ్య లక్కిరెడ్డిపల్లి, పీలేరు, రాయచోటి, వాల్మీకిపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

'ముదివేడు' భూ సేకరణ త్వరగా పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలోని ముదివేడు రిజర్వాయర్ లిఫ్ట్ ఇరిగేషన్ భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష, సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ముదివేడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ముదివీడు రిజర్వాయర్ పరిసర ప్రాంతాలకు సంబంధించి సాగు, తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు చేపట్టిన ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ రిజర్వాయర్ నిమిత్తం ముంపునకు గురయ్యే గ్రామాల బాధితుల పునరావాస లేఔట్లలో వేగంగా మౌలిక వసతులు కల్పించాలన్నారు. ముదివేడు రిజర్వాయర్‌కు సంబంధించిన భూ సేకరణపై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అవార్డ్స్ పాస్ చేసిన భూమికి సంబంధించి లబ్ధిదారులకు త్వరగా పరిహారం పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఇంకా చేయాల్సిన భూసేకరణలో ప్రభుత్వ భూమి, పట్టా భూమి, డీకేటి, అసైన్మెంట్ భూముల వివరాలను ఆయా తహశీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. పట్టా భూములకు సంబంధించి ఫామ్-సిలో నివేదిక సమర్పించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, డిఆర్‌ఒ సత్యనారాయణ, మదనపల్లి ఆర్‌డిఒ మురళి, పంచాయతీరాజ్ ఎస్‌ఇ కృష్ణమూర్తి, ల్యాండ్ అండ్ సర్వే ఏడీజయరాజు, తహశీల్దార్లు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష


రీ-సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీ-సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా పూర్తి చేయాలని భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గురువారం విజయవాడ సిసిఎల్‌ఎ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో రీ-సర్వే పై భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ మాట్లాడుతూ డిసెంబర్ 31 నాటికి ఫైనల్ ఆర్‌ఒఆర్‌ఒ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. రీసర్వే పూర్తయిన గ్రామాలలో హద్దు రాళ్ల నాటడం, భూహక్కు పత్రాల పంపిణీ పెండింగ్ లేకుండా చూడాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూ హక్కు పత్రాల పంపిణీకి సంబంధించి ప్రత్యేక దృష్టి సారించిందని ఫేస్ -2 కింద పెండింగ్‌లో ఉన్న భూ హక్కు పత్రాలు పంపిణీ త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ గిరీష పిఎస్, మాట్లాడుతూ జిల్లాలో రెండవ దశ రీ సర్వే కార్యక్రమం పకడ్బందీగా పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఫేస్-2 కింద పెండింగ్‌లో ఉన్న భూహక్కు పత్రాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. భూహక్కు పత్రాల పంపిణీ నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో హద్దురాళ్లను తప్పనిసరిగా పాతించాలన్నారు. ప్రణాళిక బద్ధంగా సరైన కార్యాచరణ రూపొందించుకొని, హద్దురళ్లు నాటే ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ జయరాజు పాల్గొన్నారు.

'సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి'

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వం సూచించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ముఖ్యమైన 8 అభివృద్ధి సూచికల్లో నిర్దేశించిన లక్ష్యాలు సాధించేందుకు ప్రత్యేకంగా కృషి చేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి కలెక్టర్లు, జెసిలతో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి వివిధ అంశాలలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అందుకొని వివిధ అభివృద్ధి సూచికలలో రాష్ట్రం ప్రగతి పథంలో పయనించేందుకు కలెక్టర్లు అందరూ కృషి చేయాలని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్ హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ గిరీష పిఎస్ మాట్లాడుతూ ప్రజా జీవన ప్రమాణాలను మెరుగు పరచుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా అనీమియా నివారణ చర్యలు ముమ్మరంగా చేపట్టాలన్నారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనత బాధితులను గుర్తించిన వారిలో హిమోగ్లోబిన్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తక్కువ బరువు ఉన్న పిల్లలపై ఐసిడిఎస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎన్‌సిడిసిడి సర్వేలో ఆధార్ కరెక్షన్ చేయడానికి ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికి ఉచిత ఆరోగ్య సేవలు అందించేందుకు కృషి చేస్తుందని, ఆ దిశగా అధికారులందరూ కూడా పనిచేయాలని తెలిపారు. ఎఎన్‌ఎం, ఆశా వర్కర్లు ప్రతి ఇంటిని సందర్శించి ఆరోగ్య పరీక్షలు చేయాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామీణ ప్రాంతాల్లో మంచి వైద్య సేవలు అందించి ప్రజల నుంచి మన్ననలను పొందాలన్నారు. చిన్నపిల్లల ఆధార్ అప్డేషన్, విద్యార్థుల గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్‌పై కూడా ప్రత్యేక దృష్టి సారించి వంద శాతం పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా డ్రాప్ అవుట్ చిల్డ్రన్ పై దృష్టి పెట్టాలని పదవ తరగతి అనంతరం కళాశాలలో చేరని వారిని ఓపెన్ స్కూల్లో చేర్పించేందుకు తగు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. అనంతరం ఆయా శాఖలలో పలు అంశాలపై సమీక్షించి పలు సూచనలు ఇచ్చారు. కీలక అంశాల్లో సుస్థిరమైన, సమగ్రమైన అభివృద్ధి సాధించాలని, ప్రభుత్వ శాఖలన్నీ పరస్పర సమన్వయంతో లక్ష్యాల సాధనకు కృషి చేయాలని కలెక్టరు కోరారు. వీడియో కాన్ఫరెన్స్ లో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం : డిప్యూటీ డిఇఒ



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో డిప్యూటీ డిఇఒ, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - రాయచోటి

మంచి ఆరోగ్యం కోసం విద్యార్థి దశ నుండే చిరుధాన్యాల ఆహారాన్ని ఒక అలవాటుగా చేసుకోవాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి వరలక్ష్మి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టర్ పిలుపుమేరకు డైట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా సైన్స్ సెమినార్‌ను జిల్లా సైన్స్ అధికారి మార్లఓబుల్ రెడ్డి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె 'చిరుధాన్యాలు మంచి పోషకాహారమా లేక ప్రీతికర ఆహారమా' అనే అంశంపై సైన్స్ సెమినార్ నిర్వహించారన్నారు. చిరుధాన్యాలను ఆహారంగా అలవాటు చేసుకుంటే వ్యాధులు దరి చేరవన్నారు. స్థూలకాయం, చక్కెర వ్యాధి, జీర్ణానాళ సమస్యలకు చిరుధాన్యాలు ఔషధం లాగా ఉపయోగపడతాయన్నారు. మంచి పోషకాహారంపై సమాజానికి అవగాహన కల్పించడానికి ఈ ఇతివృత్తాన్ని ఎంపిక చేశామన్నారు. ఇదే అంశంపై మండల స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు విద్యార్థులకు సెమినార్ నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పలువురు విద్యార్థులు ఈ సెమినార్లో పాల్గొనగా మొలకలచెరువు మండలం బురకాయల కోటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మానస సైన్స్ సెమినార్‌లో విశిష్ట ప్రతిభ కనబరచి జిల్లా మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. రామాపురం మోడల్ స్కూల్ విద్యార్థి ఉమేహాని ద్వితీయ స్థానం, పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి భానుశేఖర్‌రెడ్డి తృతీయ స్థానం సాధించారు. వీరికి సర్టిఫికెట్లు, మెమెంటోలు బహుకరించారు. రాయచోటి ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలకు చెందిన అధ్యాపకులు విశ్వ ప్రసాద్, సుగుణ న్యాయ నిర్ణయాలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆప్ కాస్ట్ జిల్లా కన్వీనర్ రవీంద్రారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి, భోగా వెంకటసుబ్బయ్య, కృష్ణయ్య ఇతర సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

- కడప జిల్లా ఎస్‌పికి జర్నలిస్టు సంఘాల వినతి



కడప జిల్లా ఎస్‌పికి వినతిపత్రం సమర్పిస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు

ప్రజాశక్తి-కడప సిటీ

కడప జిల్లా వేంపల్లి మండల విలేకరులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఎస్‌పి సిద్ధార్థ కౌశల్‌కు గురువారం జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తుంటే కవరేజీ చేయడానికి వెళ్లిన 9 మంది విలేకరులపై అక్రమ కేసులు బనాయించారని ఎస్‌పికి సమర్పించిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్న ప్రాంతంలో అనుమతులు లేవని స్వయానా స్థానిక రెవెన్యూ అధికారులు చెబుతున్నప్పటికీ జెపి కన్‌స్ట్రక్షన్ వారు ఇసుకను తరలిస్తున్న విషయాన్ని ఎస్‌పికి జర్నలిస్టు సంఘాల నేతలు రామసుబ్బారెడ్డి, నారాయణ, శ్రీనాథ్‌రెడ్డి వివరించారు. ఫిర్యాదుదారుడు తన ఫిర్యాదులో జర్నలిస్టులు పనిచేసే సంస్థల పేర్లను నమోదు చేయకున్నా వేంపల్లె ఎస్‌ఐ తిరుపాల్ నాయక్ అత్యుత్సాహంతో మీడియా సంస్థల పేర్లను కూడా ఎఫ్‌ఐఆర్‌లో చేర్చారని వారు ఎస్‌పి దృష్టి తీసుకువచ్చారు. జర్నలిస్టు సంఘాల నేతల వాదనకు ఎస్‌పి సిద్ధార్థ కౌశల్ స్పందిస్తూ జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులపై విచారణ చేయించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. మీరు, తాము కలిసి పనిచేయాల్సి ఉందన్నారు. జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. కార్యక్రమంలో ఎపియుడబ్ల్యుజె, ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు రామాంజనేయులురెడ్డి, నూర్‌బాషా, రాజు, సిద్ధయ్య, బాలకృష్ణ, సుదర్శన్, శివకేశవరెడ్డి, సుబ్బారెడ్డి, జర్నలుస్టులు జయచంద్ర, ఎ.వి.సుబ్బారెడ్డి, రఘునాథరెడ్డి, ఖదీర్, గఫార్, రహీంతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



శ్రీనివాసరాజును సన్మానిస్తున్న గ్రామస్తులు

అంగన్వాడీ కేంద్రానికి వస్తువుల వితరణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలోని మన్నూరు అంగన్వాడీ కేంద్రానికి కార్యకర్త కళ్యాణి ఆధ్వర్యంలో డిఆర్‌డిఎ మాజీ రాష్ట్ర అధికారి యల్లటూరు శ్రీనివాసరాజు గురువారం ఫ్యాన్లు, బీరువా, కుర్చీలు, తలుపులు, పుస్తకాల ర్యాకులు వంటి విలువైన వస్తువులు వితరణ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ బాల్య దశలోనే చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పిస్తూ, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తూ పోషకాహార లోపం లేని నవ సమాజ నిర్మాణానికి తోడ్పడే అంగన్వాడీ కేంద్రాలు కావలసిన అన్ని వసతులతో కూడి ఉండాలన్నదే తన ఆకాంక్ష అని తెలిపారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఏలోటు లేకుండా ప్రభుత్వం అందించే నాణ్యమైన ఆహారం అందించి ఆదర్శ అంగన్వాడీ కేంద్రంగా తీర్చిదిద్దాలని అంగన్వాడీ కార్యకర్తకు సూచించారు. భవిష్యత్తులో కూడా అంగన్వాడీ కేంద్రానికి సంబంధించి ఏ అవసరం వచ్చినా తనకు తెలియజేస్తే సహాయ సహకారాలు అందించగలనని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనను మన్నూరు గ్రామస్తులు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సింగంశెట్టి నరేంద్ర, ఇడిమడకల రామ, నారదాసు రామచంద్రయ్య, చిన్నయ్య పాల్గొన్నారు.

మంత్రి రోజాపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు

మదనపల్లె అర్బన్: పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని గురువారం పోలీసుస్టేషనులో జనసేన నాయకుల ఫిర్యాదు చేశారు. జనసేన పార్టీ రాష్ట్ర అధినాయకత్వం ఆదేశాల మేరకు రోజా సభ్యసమాజం తలదించుకొనేలా, మహిళలకు చెడ్డ పేరు తెచ్చేలా ప్రతిపక్ష పార్టీ నాయకులను ముఖ్యంగా జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్‌ని వ్యక్తిగతంగా తీవ్ర పదజాలంతో దుర్భాషలాడుతూ జనసేన పార్టీ కార్యకర్తలు మనోభావాలు దెబ్బతినే విధంగా మాట్లాడడం సమంజసం కాదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో గురువారం మదనపల్లి వన్ టౌన్ సిఐకి ఆర్కే రోజా మీద క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం, టౌన్ ప్రెసిడెంట్ నాయని జగదీష్, రూరల్ అధ్యక్షులు గ్రానైట్ బాబు, టౌన్ ఉపాధ్యక్షులు పురం నగేష్, రూరల్ ఉపాధ్యక్షులు కుమార్, రూరల్ ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీ రెడ్డెమ్మ, జనరల్ సెక్రటరీ గండికోట లోకేష్, సెక్రటరీ అర్జున, సెక్రటరీ జనార్దన్, స్వాతి, చందు, కేశవ పాల్గొన్నారు.



రోజాపై పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేసిన జనసేన నాయకులు

అధికారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సచివాలయం ఉద్యోగులను మానసికంగా వేధిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామ, వార్డు సచివాలయం ఎంప్లాయిస్ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గుడి నాగరాజ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కొంత మంది ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు సచివాలయం ఉద్యోగులను మానసికంగా వేదిస్తున్నారని, సమయ పాలన లేకుండా, ఎప్పుడంటే అపుడు మీటింగ్‌లు పెడుతూ, సెలవు రోజుల్లో సైతం విధులకు రావాలని వేదిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు మాత్రం ఇంట్లో కూర్చొని పర్యవేక్షణ చేస్తున్నారని, సెలవు రోజుల్లో డ్యూటీకి రాని వారిని సస్పెండ్ చేస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కోనసీమ జిల్లా రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ ఒక సచివాలయం కార్యదర్శిని మానసికంగా వేధించడమే కాకుండా బలవంతంగా ఉద్యోగానికి రాజీనామా చేయించడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇలాంటి అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కొంత మంది అధికారులు సచివాలయం ఉద్యోగులుకు ఇంక్రిమెంట్ వేయకుండా వేదిస్తున్నారన్నారు. జులై 1వ తేదీ నుంచి ఇంక్రిమెంట్ ఇవ్వాల్సి ఉండగా కొంతమంది అధికారులు ఇవ్వకుండా వేధిస్తున్నారన్నారు. మహిళా కార్యదర్శిలకు ఇంత వరకు ఎవ్వరికీ ఇంక్రిమెంట్ ఇవ్వలేదని, బిఎల్‌ఒల పేరుతో అందరికి బెదిరిస్తున్నారని తెలిపారు. చాలా మంది సచివాలయం ఉద్యోగులు అధికారుల ఒత్తిడికిలోనై ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనియెడల సచివాలయం ఉద్యోగులతో కలసి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని స్పష్టం చేశారు.



రాస్తారోకో చేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని, ఇందుమ కోసం మాదిగ ప్రజలు రోడ్డు ఎక్కాల్సిందేనని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధికార ప్రతినిధి వై.రవీంద్ర పేర్కొన్నారు. గురువారం పట్టణంలో ర్యాలీతో పాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ నెల 18 నుండి 22 వరకు జరుగుతున్న ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో షెడ్యూల్ కులాల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎంఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆరేటి వాసు, మోపూరి మనోహర్, వై.రాజా, ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎస్.రెడ్డిశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాస్తారోకోకు మాదిగలు పెద్దఎత్తున పాల్గొని తమ ఆకాంక్షను బలంగా చాటుకున్నారు. వందలాది వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో వన్ టౌన్ సిఐ, ఎస్‌ఐలు తమ సిబ్బంది సహాయంతో వీరిని పోలీస్ స్టేషనుకు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి రవీంద్ర మాట్లాడుతూ 25 ఏళ్లుగా ఎస్‌సి ఎబిసిడి వర్గీకరణ కోసం నిర్విరామ పోరాటం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా నరేంద్ర మోడీ ప్రభుత్వం కళ్లు తెరచి మాదిగల న్యాయపరమైన ఎబిసిడి వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోలో మండల అధ్యక్షులు రాజేష్, మండల ఎంఎస్‌పి ఇన్‌ఛార్జి కొండప్ప, నాగా, మనోజ్, అశోక్, కార్యదర్శి మంజునాథ్, అంజిబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్‌టిఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఎన్‌టిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

మదనపల్లె అర్బన్: టిడిపి చంద్రబాబు నాయుడుపై కేసులు వీగిపోవాలని రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు స్వర్గీయ ఎన్టీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ముఖ్యమంత్రి కక్షపూరితంగానే టిడిపి అధినేతపై అక్రమ కేసులు పెట్టి బెయిల్ రాకుండ అడ్డుకొంటున్నారని ఆరోపించారు. స్థానిక నిమ్మనపల్లి సర్కిల్ వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి తెలుగుదేశం శ్రేణులు పాలాభిషేకం చేసి, అధికార వైఖరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కక్షపూరితంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీద పెట్టిన అక్రమ కేసులు వీగిపోవాలని, పుంగనూరు, అంగళ్లు ఘటనల్లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల మీద పెట్టిన అక్రమ కేసులను ఎదుర్కొంటున్నవారికి తీర్పు అనుకూలంగా రావాలని, బెయిల్‌పై విడుదల కావాలని ఎన్టీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశామన్నారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ విద్యాసాగర్, నవీన్ చౌదరి, బాలు స్వామి పాల్గొన్నారు.

ఆర్‌బికెల్లో అందుబాటులో యూరియా

మదనపల్లె అర్బన్: ఆర్‌బికెల ద్వారా రైతులకు సరిపడా యూరియా పంపిణీ చేస్తామని మండల వ్యవసాయ అధికారి నాగప్రసాద్ తెలిపారు. గురువారం మండలంలో యూరియా కోసం రైతులు క్యూ లైన్లులో బారులు తీరారు. స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో వరిసాగు రైతులు చేరుకొన్నారు. దీనిపై మండల వ్యవసాయ అధికారి నాగప్రసాద్ స్పందిస్తూ ఆర్‌బికెల ద్వారా రైతులకు యూరియా అందిస్తామని చెప్పారు. రైతులకు ఆందోళన అవసరం లేదన్నారు.ఇందులో భాగంగా బసినికొండ మరియు కొండామర్రిపల్లె ఆర్‌బికెల పరిధిలో రైతులకు స్లిప్పుల ద్వారా పంపిణీ చేశారు. మండలంలోని అన్ని ఆర్‌బికెలలో స్టాక్ చేసి అందజేశామని, త్వరలోనే మరింత యూరియా వస్తుందని తెలిపారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా లిక్విడ్ రూపంలో అందుబాటులో ఉందని రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవచ్చుని సూచించారు. ఇప్పటికే 40 టన్నులు పంపిణీ చేశామని, మరో 40 టన్నులు అందుబాటులో ఉంటుందన్నారు.

ఘనంగా గురజాడ అప్పారావు జయంతి

వాల్మీకిపురం: అభ్యుదయ కవితా పితామహుడు రచయిత, సంఘ సంస్కర్త, తెలుగుబాషా మహాకవి గురజాడ అప్పారావు జయంతిని మండలంలోని చింత పర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం జెవివి జిల్లా అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ సమాజంలోని సాంఘీక దురాచారాలపై తన కలంతో గళమెత్తిన అభ్యుదయ వాది, గొప్ప మానవతావాది గురజాడ అప్పారావు అని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రెడ్డెప్పరెడ్డి, ఉపాధ్యాయులు సువర్ణ, రమేష్‌బాబు, గురవమందాడి, సరిత, లలిత, ఉమాదేవి, మహమ్మద్ జాను, విద్యార్థులు పాల్గొన్నారు.



గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెవివి అధ్యక్షులు, ఉపాధ్యాయులు

విద్యార్థుల్లో సృజనాత్మకతకు యువజనోత్సవాలు

- జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారిని మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. స్టెప్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి 2023 యువజనోత్సవాలు గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ స్వామి వివేకానందుడి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో ఈ పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. యువత చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా పాల్గొనడం వలన మానసిక ఉల్లాసం కలుగుతుందని పేర్కొన్నారు.



సాంస్కృతిక పోటీల్లో సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో అధికారులు



యువజనోత్సవాల్లో జానపద నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్యేక జ్యుడిషియల్ మేజిస్ట్రేట్-2 శంకర్ మాట్లాడుతూ యువత ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొని తమలోని ప్రతిభను వెలికి తీయడానికి మంచి తరుణమని పేర్కొన్నారు. స్వామి వివేకానానందుని అడుగు జాడలలో నడిచి తమ గమ్యాన్ని చేరుకోవడానికి మార్గం సుగమమం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పురుషోత్తం మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుండి వివిధ పోటీలలో 300 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. తమ కళాశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. అనంతరం జానపద నృత్యం, జానపద గేయం, స్టోరీ రైటింగ్ వంటి విభాగాలలో గెలుపొందిన యువతను అభినందించి రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలలో కూడా అత్యుత్తమ ప్రదర్శన కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో పురపాలక చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, జడ్‌పిటిసి దాసరి పెంచలయ్య, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి శ్రీదేవి రవికుమార్

రోగుల పట్ల నిర్లక్ష్యం తగదు : ఎంపిపి

ప్రజాశక్తి-కలకడ

రోగులపట్ల వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా వైద్య సేవలు అందించాలని ఎంపిపి శ్రీదేవికుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్యశాలలో రికార్డులను, హాజరు పట్టిని పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఏర్పాటు చేసి ఆస్పత్రిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కొత్తగా నిర్మి స్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచి ఆహ్లాదకర వాతావరణం ల్యాబ్, ఫార్మసీ గదులను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కిషోర్‌కుమార్‌రెడ్డి, కలకడ మెడికల్ ఆఫీసర్ మల్లికార్జునరావు, జోవహర్‌బాబు, సుబ్బరత్న, పిహెచ్ఎన్ రెడ్డమ్మ, వెంకటేశ్వరరావు, ఇస్మాయిల్, కంప్యూటర్స్ నవీన్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ భారతమ్మ, జయరామయ్య, అలివేలు, ఈశ్వరయ్య పేర్కొన్నట్టు తెలిపారు,

27న గాలివీడు మండల సమావేశం

ప్రజాశక్తి-గాలివీడు

ఈనెల 27న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శేఖర్‌నాయక్ తెలిపారు. ఎంపిపి అధ్యక్షతన ఎంపిటిసిలు, సర్పంచులు మండల స్థాయి అధికారులు సర్వసభ్య సమావే శానికి మండలంలోని అధికారులు,ప్రతి అధికారి సచివాలఉద్యోగులు, సెక్రెటరీ తమ పూర్తి నివేదికలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

ఆక్రమణలు తొలగింపునకు అనుమతి

ప్రజాశక్తి-గాలివీడు

పట్టణంలో స్థానిక బస్టాండ్ నుంచి పెద్దూరు మీదుగా తంబళ్లపల్లికి వెళ్లే రోడ్డులోని ఆక్రమణలను ఈనెల 25న తొలగించేందుకు అనుమతి లభించింది. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆక్రమణలను తొలగించాలని స్థానిక ప్రజలు అధికారుల దృష్టికి తీసుకవచ్చారు. ఆర్అండ్‌బి జెఇ, తహశీల్దార్, ఎస్ఐ, ఎంపిడిఒ, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో పెద్దూర్ రోడ్డులో మురికి కాలువపై అక్రమణలు జెసిబితో తొలగించేందుకు ఏర్పాట్ల సిద్ధం చేశారు. ఆక్రమణల తొలగింపుతో సంవత్సరాల నుంచి ఇబ్బందులు పడుతున్న ట్రాఫిక్ సమస్య తీరుతుందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



ప్రభుత్వ పాఠశాల దగ్గర పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

మెరుగైన పారిశుధ్యానికి సహకరించండి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మెరుగైన పారిశుధ్యానికి పట్టణ ప్రజల సహకారం ముఖ్యమని నగర పంచాయతీ కమిషనర్ మనోహర్ పేర్కొన్నారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా గురువారం పలు ప్రభుత్వ, కార్యాల యాల ఆవరణంలో పారిశుధ్య పనులను నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్ట ణాల్లో మెరుగైన పారిశుధ్యం కల్పించే ఉద్దేశంతో స్వచ్ఛ క్లీన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు.చెత్తాచెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ పడవేయకుండా నగర పంచాయతీ సరఫరా చేసిన చెత్త డబ్బాలలో వేసి పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. ప్రజలు, నగర పంచాయతీ సిబ్బంది సమ న్వయంతో ముందుకెళ్లినప్పుడే స్వచ్ఛ బి.కొత్తకోట సాకారమవుతుందన్నారు.

రూ.56 వేలు పలికిన గణేష్ లడ్డూ

ప్రజాశక్తి-పుల్లంపేట



లడ్డూను దక్కించుకున్న శివప్రసాద్‌రాజు

మండల పరిధిలోని అనంతంపల్లి గ్రామంలో వినాయక చవితి నాలుగవ రోజు నిమజ్జనం పురస్క రించుకొని భారీ స్థాయిలో లడ్డూ వేలంపాట నిర్వహిం చారు. వేలం పాటకు ఆశావహులు ప్రయ త్నిం చగా చివరికి శివప్రసాద్‌రాజు తండ్రి రూ.56వేలు వినాయక లడ్డూను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. సమ్మెట నారాయణరాజు భార్య పద్మావతమ్మ, కుటుంబ సభ్యులు భారీస్థాయిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సబ్సిడీ ఉలవలు సద్వినియోగం చేసుకోండి



ఉలవలను పంపిణీ చేస్తున్న నారాయణరెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేసే ఉలవలను సద్వినియోగం చేసుకోవాలని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, ఎఒ రమణ కుమార్‌లు తెలిపారు. గురువారం మండ లంలోని అన్ని ఆర్‌బికె కేం ద్రాల్లో రైతులకు సబ్సిడీ ఉలవలు పంపిణీ చేశారు. మండలానికి 500 క్వింటాళ్లు ఉలవలను పంపిణీ చేయనట్లు ఎఒ తెలిపారు 80 శాతం ప్రభుత్వ సబ్సిడీ పోను 10 కేజీల ఉలవల పంట గ్రాస్ రూ.216 రూపాయలు రైతు వాటా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మైనుద్దీన్, పద్మనాభరెడ్డి, రెడ్డప్ప రెడ్డి, కరీం పాల్గొన్నారు.

క్రీడల్లో కన్నెమడుగు పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు కన్నెమడుగు ఉన్నత పాఠశాలలో గురువారం అభినందన తెలిపారు. హెచ్ఎం మదన్మోహన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అభినందన సభను నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నిర్వహించిన ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, యోగ తదితర ఆటల పోటీలలో పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచడం హర్షణీమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి పాఠశాలకు మంచిపేరు తేవాలన్నారు. మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

అక్రమ లేఅవుట్లపై చర్యలు : డిఎల్‌పిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి



అధికారులకు సూచనలు చేస్తున్న డిఎల్‌పిఒ నాగరాజా

అక్రమ లేఅవుట్లను ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని మదనపల్లి డిఎల్‌పిఒ నాగరాజా తెలిపారు. గురువారం మండల కేంద్రమైన నిమ్మనపల్లిలోని సంపద తయారీ కేంద్రాన్ని ఇఒ పిఆర్‌డి చలపతి రావుతో కలసి సందర్శించారు. అనంతరం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ శేషగిరిరావు, స్థానిక సర్పంచ్ పాపులమ్మ భర్త మల్లప్ప, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలో పంచాయితీ అనుమతులు లేకుండా వెలుస్తున్న లేఅవుట్లను గుర్తించి, వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచిం చారు. లేఅవుట్లను ఏర్పాటు చేసే యజమానులు ముందుగా పంచాయతీ రాజ్‌శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు వారి పరిధిలోని పంచాయతీలలో అక్రమంగా వెలసిన లేఅవుట్‌లను వెంటనే గుర్తించాలన్నారు. సంపద తయారీ కేంద్రాల ద్వారా చెత్త నుంచి ఎరువు లను తయారుచేసి స్థానిక రైతులకు విక్రయించి సంపదను సృష్టించాలన్నారు. వర్మీ కంపోస్ట్ ఎరువులను నిత్యం తయారుచేసి రైతులకు విక్రయించాలన్నారు. తద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీల అభివృద్ధికి వినియోగించాలని సూచిం చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి, మల్లప్ప, ఇంజినీరింగ్ సహాయకులు పురుషోత్తం పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం : ఎంపిపి



రక్త నమూనా ప్యాకెట్లను అందిస్తున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

రక్తదానం మరొకరికి ప్రాణదానం అని, అన్ని దానాలలోకెల్ల రక్తదానం ఎంతో గొప్పదని మండల అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ వైస్‌చైర్మన్ విజయభాస్కర్ పేర్కొన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ముందుగా రూ.ఏడుకోట్ల నిర్మించిన నూతన భవనంలోని అన్ని విభాగాలును. డిఎం హెచ్‌ఒ కొండయ్య, డిసిహెచ్ఎస్ డేవిడ్ సుకుమార్‌లు తినిఖీ చేశారు. ఎక్స్‌రే, ఇసిజి గది, ఆపరేషన్ థియేటర్, రక్త నమూనాలకది, కాన్పులు రికారులును వారు పరిశీలించారు. ఈ రక్తదాన శిబిరంలో సుమారు 50 మంది పైగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.రక్తదానం విషయంలో అపోహలు అవసరం లేదని ఆరోగ్యంగా ఉన్నవారు ఎవరైనా రక్తదానం చేయవచ్చు అన్నారు. రక్తాన్ని దానం చేస్తే ఇంకొకరికి ప్రాణాన్ని కాపాడిన వారమవుతారని చాలామంది రక్తం దొరక్క ప్రాణాలు కోల్పోతున్నారని అలాంటి వారిని ఆదుకోవడమే మానవ లక్షమన్నారు. చాలామంది ప్రమాదాల్లో గాయపడి తీవ్ర రక్తస్రావం అయ్యి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలు కాపాడేందుకు రక్తదానం దోహదప డుతుం దన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపు నిచ్చారు. ఎంపిపితో పాటు ఎంపిటిసిలు జగన్మో హన్‌రెడ్డి, లక్ష్మీనారా యణ, వైసిపి యువత రక్తదానం చేశారు. రక్తదానం చేసిన దాతలకు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి, సహదేవరెడ్డి ల ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ ధరణికుమార్, అభివృద్ధి డైరెక్టర్లు విజయ భాస్కర్, మహమ్మద్‌రఫీ, గంగమ్మ, ఆలయచైర్మన్ సామల నరసింహారెడి, సర్పంచ్ వెంకట నారాయణరెడ్డి, ఎంపిటిసి శంకర్‌నాయుడు, ఉప సర్పంచ్‌లు రాజారెడ్డి, సంజీవరెడ్డి వైద్యులు నవాజ్, నిసార్ అహ్మద్, జీవన్, భరత్ కుమార్‌రెడ్డి, సిబ్బంది రెడ్డి, కృష్ణారెడ్డి, కిషోర్ పాల్గొన్నారు.

కూలిదండు మహా ప్రదర్శనను జయప్రదం చేయండి


ప్రజాశక్తి-గుర్రంకొండ



గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న కృష్ణప్ప

బాపట్లలో ఈనెల 25న జరిగే కూలి దండు మహా ప్రదర్శనను జయప్రదం చేయండి బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి తోపు కృష్ణప్ప పిలుపునిచ్చారు. బికెఎంయు రాష్ట్ర 22వ మహా సభలు బాపట్లలో ఈనెల 25, 26, 27 తేదీలలో సాగు భూములు సామాజిక న్యాయం, ఉపాధి సాధన కోసం కూలి దండు మహాప్రదర్శనకు వేలాదిగా తరలిరావాలన్నారు. స్థానిక బస్టాండ్ సమీపంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రమహాసభల గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తోపు కృష్ణప్ప మాట్లా డుతూ వ్యవసాయమే ప్రధాన వృత్తిగా ఉన్న మన రాష్ట్రంలో గ్రామీణ ప్రజల్లో అత్యధికులు వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారని అన్నారు. జిల్లాలో భూస్వాముల రాజకీయ నాయకుల చేతుల్లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములు వ్యవసాయ కూలీలకు, దళితులకు, గిరిజనులకు పంపిణీ చేయాలని, కోనేరు రంగారావు కమిటీ సిఫారసులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అంజనప్ప, నరేష్, నారాయణప్పరెడ్డి పాల్గొన్నారు.

లెఫ్టినెంట్ కల్నల్‌కు సన్మానం



లెఫ్టినెంట్ కల్నల్ అభిషేక్‌రెడ్డిని సన్మానిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని మైలపల్లి గ్రామానికి చెందిన లెఫ్టినెంట్ కల్నల్ ముద్దా అభిషేక్‌రెడ్డి సిడిఎస్ అత్యంత పురస్కారం అందుకున్న సందర్భంగా గురువారం మండల వైసిపి నాయకులు ఎల్‌వి. మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో దుశ్శాలువా ఘనంగా సత్కరించారు. మైలపల్లి గ్రామంలోని అభిషేక్‌రెడ్డి స్వగృహంలో అభిషేక్‌రెడ్డితో పాటు కుటుంబ సభ్యులైన తండ్రి రవికుమార్‌రెడ్డి, తల్లి రాధికరెడ్డి దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో సిడిఎస్‌కు ఎంపికైన ఏకైక వ్యక్తిగా మైలపల్లి గ్రామానికి చెందిన ముద్దా అభిషేక్ రెడ్డి ఎన్నికవ్వడం మండల వాసులకు గర్వకా రమన్నారు. యువత అభిషేక్‌రెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని దేశ సేవలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో హరినాథరెడ్డి, మండల ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యంరెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, శంకర్‌రెడ్డి, చెంచయ్య, పెంచల్‌రెడ్డి, జమీర్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ గిరీష

నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - రాయచోటి

కలెక్టరేట్ వెనక వైపున కలెక్టర్, జెసి, డిఆర్ఒ బంగ్లాల నిర్మాణం కోసం చేపట్టిన భూమి అభివృద్ధి పనులను గురువారం కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్థల మ్యాపులను ఆయన పరిశీలించారు. ఎత్తు పల్లాలుగా ఉన్న ఆ ప్రాంతం మొత్తం కలెక్టర్ కలియతిరిగి బంగ్లాల హద్దులను పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలలో చేపట్టాల్సిన పనులపై కలెక్టర్ పలు సూచనలు జారీ చేశారు. బంగ్లా నిర్మాణ పనులను వెంటనే మొదలుపెట్టి వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులను నాణ్యతగా పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ సత్యనారాయణ, ఆర్‌డిఒ రంగస్వామి, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, తహశీల్దార్ ప్రేమంత కుమార్, ఆర్అండ్‌బి డిఇ చంద్రశేఖర్ రెడ్డి, డ్వామా పీడీ మద్దిలేటి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇవిఎంల ఫస్ట్‌లెవల్ చెక్‌కు ఏర్పాట్లు పూర్తి చేయాలి

జిల్లా కేంద్రంలోని ఇవిఎంల ఫస్ట్ లెవెల్ చెక్ (ఎఫ్ఎల్‌సి)కు పటిష్టంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం రాయచోటి మార్కెట్ యార్డులోని ఇవిఎం గోదామును అధికారులతో కలిసి కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా గోదాములో ఉన్న వివి ప్యాట్, బియు, సియు యూనిట్లను పరిశీలించారు. ఎఫ్ఎల్‌సి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఎఫ్ఎల్‌సపి చేయడానికి ఇవిఎం గోదాము పక్కన ఉన్న మరొక గోదామును కూడా కలెక్టరు పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇవిఎం గోదాము వద్ద భద్రత నిమిత్తం 24/7 ప్రకారం సెక్యూరిటీ గార్డులు ఉండడానికి ఒక రూమును నిర్మించాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. అనంతరం వివిధ అంశాలలో డిఆర్ఒ, ఆర్‌డిఒలతో చర్చించి పలు సూచనలు జారీ చేశారు.

'మండిపల్లి'కి బెయిల్ రావడంపై హర్షం

ప్రజాశక్తి - రాయచోటి

ఆగస్టు 4న పుంగనూరు, అంగళ్లలో జరిగిన సంఘటన కేసుల్లో టిడిపి నియోజకవర్గ నాయకులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి(రాముడు)కి గురువారం హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మండిపల్లి ఆయన వర్గీయులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి స్వీట్లు పంచిపెట్టుకొని పెద్దఎత్తున బాణా సంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. రాయచోటి ఎస్ఎన్ కాలనీలోని మండిపల్లి భవన్ ఎదుట రాంప్రసాద్ రెడ్డి వర్గీయులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ స్వీట్లు పంచిపెట్టుకొని, బాణా సంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. తమ నాయకుడు రాంప్రసాద్ రెడ్డి అక్రమ కేసులకు భయపడడని, ప్రజలకు ఏ కష్టం వచ్చినా ముందుంటారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో అధికార వైసిపికి పరాభవం తప్పదని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో రాముడు వర్గీయులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ముస్లిం మైనార్టీ నాయకులు,పాల్గొన్నారు.

ఫారెస్ట్ అధికారిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఫారెస్టు అధికారిపై దాడి చేసిన వారిని శిక్షించాలని మదనపల్లె అటవీశాఖ విశ్రాంత ఉద్యోగ సంక్షేమ సంఘ నేత రెడ్డెప్ప డిమాండ్ చేశారు. మదనపల్లె ఫారెస్ట్ ఆఫీసు వద్ద ఆ సంఘం నేతలతో నిరసన తెలిపారు. అనంతరం ఎఫ్ఆర్ఒ మాధవరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రెడ్డప్ప మాట్లాడుతూ జిల్లా ఫారెస్ట్ అధికారి వివేక్‌పై దాడిని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అటవీ సిబ్బంది ముక్తకంఠంతో ఖండించాలన్నారు. దాడికికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకునే వరకు రాష్ట్ర వ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు.



ఎఫ్ఆర్ఒ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

'కేసు కోర్టులో ఉండగా భూమిని చదును చేశారు'

ప్రజాశక్తి - రాయచోటి

వీరబల్లి మండల కేంద్రంలో కోర్టులో కేసు నడుస్తున్నా సర్వేనెంబర్ 253/21లోఉన్న భూమిని నూతి అప్పయ్య అనే వ్యక్తి దౌర్జన్యంగా కబ్జా చేసి పునాది వేస్తున్నాడని రిటైర్డ్ ఉద్యోగి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వీరబల్లి మండల కేంద్రంలో తమ తల్లి నూతి సుబ్బమ్మ పేరుతో సర్వేనెంబర్ 253/21 లో పట్టా నెంబర్ 774లో గల సత్రాన్ని నూతి అప్పయ్య పగలగొట్టి దౌర్జన్యంగా గునాది వేస్తున్నాడని తెలిపారు. దౌర్జన్యంగా సత్రాన్ని పగలగొడుతున్న సమయంలో తన భార్య, కుమారుడు వెళ్లి ఎందుకు సత్రాన్ని పగలగొడుతున్నారని అడుగగా '50 ఏళ్ల కిందట ఊరు విడిచి వెళ్ళిపోయారు.. మీకేం సంబంధం' అంటూ, దౌర్జన్యం చేసి, బెదిరించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై వీరబల్లె రెవెన్యూ అధికారులతో పాటు పోలీసులను ఆశ్రయించామని తెలిపారు. రికార్డుల ప్రకారం ఆ స్థలం పాత పట్టా అని,మీరు కోర్టుకు వెళ్లి సమస్యను పరిష్కరించుకోండి అని చెప్పడంతో కోర్టులో కేసు వేశామని చెప్పారు. ప్రస్తుతం ఆ స్థలం విషయంపై సమస్య కోర్టులో నడుస్తున్నా నూతి అప్పయ్య కోర్టు ఆదేశాలను కూడా లెక్కచేయకుండా దౌర్జన్యంగా ఆ స్థలంలో ఉన్న సత్రాన్ని పగలగొట్టి పునాదులు కడుతున్నాడని వాపోయారు. తమ స్థలంలో వేస్తున్న పునాదులను ఆపి కబ్జాకు పాల్పడుతున్న నూతి అప్పయ్యపై కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని బాధితుడు పోలీసు, రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేశారు.



భోజనాన్ని వడ్డిస్తున్న శ్రీనివాసరాజు

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-నందలూరు

అన్ని దానాలలోకన్నా అన్నదానం గొప్పదని డిఆర్‌డిఎ మాజీ అధికారి యల్లటూరు శ్రీనివా సరాజు అన్నారు. గురువారం మండలంలోని నాగిరెడ్డిపల్లె వినాయక ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి సభ్యులు యల్లటూరు శివరా మరాజు, సింగంశెట్టి నరేంద్ర, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, ఆలయ కమిటీ ఆకేపాటి జగదీశ్వర్‌రెడ్డి, మేడా వెంకటకుమార్, పల్లె మాధవి, ఒబిలి రామ్మోహన్‌రెడ్డి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.**గాలివీడు :** ఫక్కిరారెడ్డిగారిపల్లి లోని వినాయక విగ్రహం వద్ద శ్రీకాంత్, అశ్విని దంపతులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సూరి, సాయినాథ్‌రెడ్డి నాగభూషణ్‌రెడ్డి, హేమకుమార్‌రెడ్డి, గోపిరెడ్డి మహిళలు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి, ఎంపిడిఒలు

నేడు 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల కేంద్రమైన నిమ్మనపల్లిలో నేడు జరిగే జగనన్నకు చెబుదాం ప్రత్యేక కార్యక్రమానికి ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలో ఏర్పాట్లను ఎంపిడిఒ శేషగిరిరావుతో కలిసి పరిశీలించారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని ప్రవేశపె ట్టారని అన్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ఈ ను నిర్వహించి, ప్రజల నుంచి వచ్చే వినతులను పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, డివిజన్ స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొం టారని తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సమస్యలను తగిన ధ్రువపత్రాలతో, వ్యక్తిగత ఆధార్‌తో జతపరిచి, వినతి పత్రం రూపంలో కలెక్టర్‌కు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి చలపతిరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. **రాయచోటి :** ప్రజా సమస్యలు మెరుగైన, వేగవంతమైన పరిష్కారం కోసం మండల స్థాయిలో అన్ని శాఖల అధికారుల సమక్షంలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం శుక్రవారం నిమ్మనపల్లి మండలంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొనాలని అధికారులందరికీ పేర్కొన్నారు.

క్రైం కార్నర్

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



చెట్టుకు ఉరి వేసుకొనివున్న రామచంద్ర

పట్టణ శివారులోని బ్రాహ్మణపల్లి ప్రధాన రహదారి వద్ద రామ చంద్ర(55) అనే వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని అనుమానాస్పదంగా మృతి చెందడంలో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరు కున్న పోలీసులు తెలిపిన వివరాలకు మేరకు..పుల్లంపేట మండలం వైఎస్ఆర్ కాలనీకి చెందిన రామచంద్ర భార్యతో గొడవపడి మనస్తాపంతో బ్రాహ్మణపల్లి వద్ద చెట్టుకు ఉరివేసుకొని మృతిచెందినట్లు ప్రాథమికంగా నిర్ధా రించు కున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభు త్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసునమోదు పూర్తిస్థాయిలో విచారణ చేపడతామని తెలిపారు.

యువకుడి బలవన్మరణం

మదనపల్లె : అర్బన్‌ఫైనాన్సర్లు బైకుక్ తీసుకెళ్లడంతో తీవ్ర మనస్థాపన చెందిన ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విషాదకర ఘటన మదనపల్లిలో గురువారం వెలుగు చూసింది. యువకుని బలవన్మరణానికి సంబంధించి మదనపల్లి రెండవ పట్టణ ఎస్ఐ హేమాద్రి, మృతుని కుటుంబ సభ్యుల కథనం మేరకు..అనంతపురం జిల్లా, కదిరి మండలం బోడెమాండ్లపల్లికి చెందిన నాయి బ్రాహ్మణుడు గంగాధర్(27) మదనపల్లికి చెందిన మౌనికను వివాహం చేసుకుని స్థానిక అమ్మ చెరువు మెట్టుకు వచ్చి స్థిరపడి సొంతంగా బార్బర్ షాప్ నడుపుకుంటూ భార్య పిల్లలను పోషించుకుని జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. స్థానికంగా ఉన్న ఫైనాన్స్ కంపెనీలో తీసుకున్న బైక్‌ను కంతు చెల్లించలేదని ఫైనాన్సర్లు తీసుకెళ్లడంతో తన చావుకు ఫైనాన్సర్లే కారణమని భార్య మౌనికతో చెప్పి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. రెండవ పట్టణ ఎస్ఐ హేమాద్రి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



బాధితుల్ని జిల్లా ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

టాటాఎస్ వాహనం ఢీకొని దంపతులు తీవ్రం గా గాయపడ్డ సంఘటన మండలంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండ లంలోని తోకల వారిపల్లెకు చెందిన దంపతులు బి.శంకర, తన భార్య కళావతి(25)తో కలిసి ద్విచక్రవాహనంలో తంబళ్లపల్లి మండలంలోని దండు వారిపల్లికి వినాయకుని పండుగకు వెళ్లారని తెలిపారు. అక్కడ ఉత్సవాలు ముగించుకొని ఇద్దరు తిరిగి స్వగ్రామం వస్తుండగా మార్గ మధ్యంలోని కాడ్ల మడుగు క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న టాటా ఎస్ వాహనం దంపతులు ప్రయాణిస్తున్న బైకును ఢీకొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా స్థానికులు గమనించి 108 సాయంతో గాయపడ్డ వారిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారని చెప్పారు. అత్యవసర విభాగం వైద్యులు వారికి మెరుగైన వైద్య చికిత్సలు అందించి శంకర ఆరోగ్యం విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి వెళ్లాలని రెఫర్ చేశారని అన్నారు. గాయపడ్డ వారిలో కళావతికి ఆరోగ్యం నిలకడగా ఉండడంతో జిల్లా ఆస్పత్రిలోనే చికిత్స అందిస్తున్నారని చెప్పారు. ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.